RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:94 | శుక్రవారం
మార్చి 27, 2026 | పేజీలు 8
వెల: రూ.3-00 | లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260




వేద న్యూస్ తెలుగు దినపత్రిక పాఠకులకు, ప్రకటన కర్తలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, శ్రేయోభిలాషులకు, తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & చీఫ్ ఎడిటర్
వేద న్యూస్ తెలుగు దినపత్రిక
9701923260



## మార్కాపురంలో మృత్యుఘోష

### బస్సు, టిప్పర్ ఢీ.. 13 మంది సజీవ దహనం

2లో



**వేద న్యూస్, మార్కాపురం**

రాష్ట్రవ్యాప్తంగా పెను విషాదాన్ని నింపుతూ మార్కాపురం జిల్లాలో ఈరోజు తెల్లవారుజామున ఒక భయానక రోడ్డు ప్రమాదం సంభవించింది. గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులను మృత్యువు సెగలు కక్కుతూ కబళించింది. హైదరాబాద్ నుంచి పామూరుకు సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు, ప్రకాశం జిల్లా మార్కాపురంలోని రాయవరం సమీపంలోని క్వారీల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీని అత్యంత వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి బస్సు డీజిల్ ట్యాంక్ ఒక్కసారిగా పగిలిపోవడంతో నిప్పురవ్వలు ఎగసిపడి మంటలు భారీగా చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే బస్సు మొత్తాన్ని అగ్నికీలలు చుట్టుముట్టడంతో, లోపల ఉన్న ప్రయాణికులు బయటకు రావడానికి దారి లేక బస్సులోనే సజీవ దహనమయ్యారు. కళ్లెదుటే తమ వారు కాలిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో మిగిలిన వారు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 13 మంది మరణించగా, పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. అగ్నిప్రమాదం తీవ్రతకు మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడం అక్కడి వారిని కలచివేసింది.

- తెల్లవారుజామున చీకట్లోనే ముంచుకొచ్చిన మృత్యువు!
- హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తుండగా రాయవరం వద్ద ఘోర ప్రమాదం
- బస్సు-టిప్పర్ లారీ అతి వేగంతో బలంగా ఢీకొనడంతో పగిలిన డీజిల్ ట్యాంక్
- క్షణాల్లోనే చుట్టుముట్టిన మంటలు.. అస్థిపంజరాల్లా మారిన మృతదేహాలు
- గాయపడిన వారి పరిస్థితి విషమం.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం



## పీఠం ఎక్కేదెవరు.. కదిలేదెవరిది..

# ఎవరిపై వేటు?

## రేవంత్ కేబినెట్లో త్వరలో మార్పులు చేర్పులు

### వివాదాస్పద మంత్రులకు చెక్.. కొత్తవారికి ఎంట్రీ

- ఇప్పటికే అధిష్టానం ముందుకు మినిస్టర్స్ ప్రోగ్రెస్ రిపోర్ట్
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హైకమాండ్
- కొందరు మంత్రుల్లో మొదలైన గుబులు
- ఇద్దరు అమాత్యులపై వేటు తప్పదా?
- కేబినెట్ రేసులో చాలామంది ఆశావహులు
- ఢిల్లీ స్థాయిలో పైరవీలు షురూ
- సామాజిక సమీకరణకే పెద్దపీట

2లో

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ సర్కారులో 'రిపేర్' టైమ్ మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన టీమ్‌ను ప్రక్షాళన చేసి, పాలనకు సరికొత్త పదును పెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం కొలువుదీరిన ఈ రెండున్నరేళ్ల అనుభవంతో, ఎవరు పనిచేస్తున్నారు.. ఎవరు వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నారు అనే అంశంపై సీఎం ఒక స్పష్టమైన 'ప్రోగ్రెస్ కార్డ్' సిద్ధం చేశారు. ఇటీవలే ఢిల్లీ పర్యటన ముగించుకుని, హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ తెచ్చుకున్న రేవంత్ రెడ్డి, త్వరలోనే తన కేబినెట్‌కు ప్రక్షాళన చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ విస్తరణ కేవలం ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీ మాత్రమే కాదు.. అసమర్థులకు ఉద్వాసన పలికే ఒక కఠిన నిర్ణయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ తెలంగాణకు చెందిన ఇద్దరు మంత్రులపై వేటు దాదాపు ఖాయమని సమాచారం. సొంత అజెండాలతో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న వారిని పక్కన పెట్టి, సామాజిక సమీకరణలు దెబ్బతినకుండా అదే వర్గానికి చెందిన కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నారు. కొత్త రేవంత్ కాబినెట్ లోకి చేరేందుకు చాలా మంది సీనియర్ ఎమ్మెల్యే పోటీ పడుతున్నారు.

### వ్యవసాయ బావిలోకి దూకి.. తల్లీ కొడుకుల మృతి

- ఇల్లంతకుంట మండలం రంగంపేటలో విషాద ఘటన
- భర్త నిర్లక్ష్యంతో మనస్తాపం..
- కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఘటన

2లో




## భూపరిపాలనలో కొత్త దశ

### భూభారతి పోర్టల్ ప్రారంభం

- ఏప్రిల్ 2 నుంచి ఐదు మండలాల్లో పైలట్ అమలు
- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు ఒకే వేదిక
- ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ నంబర్

2లో





### ఒక్కసారి సైనిక చర్యలు ప్రారంభమైతే.. వెనుదిరిగే ప్రసక్తే లేదు..

**ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు**

- దౌత్య చర్చలు విఫలమైతే దాడులు తప్పవు
- ఇరాన్‌తో ఒప్పందం ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయని వ్యాఖ్య

2లో

### నా మాటే శాసనం

వివాదాస్పదంగా ఎనుగల్‌లో సర్పంచ్ వ్యవహార శైలి

వేద న్యూస్

శుక్రవారం | మార్చి 27, 2026

# భూపరిపాలనలో కొత్త దశ

## భూభారతి పోర్టల్ ప్రారంభం

- ఏప్రిల్ 2 నుంచి ఐదు మండలాల్లో పైలట్ అమలు
- సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు ఒకే వేదిక
- ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ నంబర్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణలో భూపరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభతరంగా మార్చేందుకు 'ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్'ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న ఈ పోర్టల్ ద్వారా సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అన్ని సేవలను ఒకే వేదికలో అందించనున్నారు. సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చామని తెలిపారు. గతంలో ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు మరింత సులభమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కొత్త వ్యవస్థను రూపొందించామని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో ఈ పోర్టల్‌ను మొదటి దశలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్‌లో వచ్చిన అనుభవాల ఆధారంగా మార్పులు చేసి రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేకంగా 'భూధార్ నంబర్' కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రీ-సర్వే నిర్వహించి భూధార్ నంబర్లను కేటాయించినట్లు చెప్పారు. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంలో ఈ వ్యవస్థ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ఒకే క్లిక్‌తో భూమికి సంబంధించిన పూర్తి సమాచారం పొందే విధంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు మంత్రి వివరించారు. ఆర్వోఆర్, మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ వివరాలు, మార్కెట్ విలువ, గ్రామ మ్యాపులు, సర్వే వివరాలు, పాస్‌బుక్ సవరణలు వంటి అన్ని సేవలు ఒకే వేదికలో లభ్యమవుతాయని తెలిపారు. దరఖాస్తు నుంచి పూర్తి అయ్యే వరకు ప్రతి దశలో ఎస్ఎంఎస్ ద్వారా సమాచారాన్ని అందించే సౌకర్యం కూడా కల్పించినట్లు చెప్పారు.

## రెవెన్యూ డివిజన్ స్థాయికి ప్రజావాణి

### విస్తరణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ప్రజా సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఈ కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి కూడా విస్తరించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. శాసనమండలి సమావేశ హాలులో ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార విధానాలను నిఖిల్ డే ప్రశంసించారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయి నుంచి రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని సమావేశంలో అభిప్రాయపడారు. ఈ దిశగా అవసరమైన చర్యలు వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్థానిక స్థాయిలో సమస్యల పరిష్కారం వేగవంతం కావడం ఈ చర్యల ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే రాజస్థాన్‌లో అమలు చేస్తున్న "జన్ సూచన పోర్టల్" తరహాలో తెలంగాణలో 'ప్రజా సూచన పోర్టల్' ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చించారు. వివిధ శాఖల పథకాలకు సంబంధించిన అన్ని వివరాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచేలా ఈ పోర్టల్ రూపొందించనున్నారు.

## ఒక్కసారి సైనిక చర్యలు ప్రారంభమైతే..

# వెనుదిరిగే ప్రసక్తే లేదు

### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. దౌత్యపరమైన చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరింత భారీ సైనిక దాడులు జరిగే అవకాశముందని స్పష్టం చేశారు. ప్రస్తుతం సైనిక చర్యలపై కూడా అమెరికా పరిశీలన చేస్తున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించి చర్చలు ఇంకా ముందుకు సాగకపోయినా, ఆ దేశం అమెరికాతో ఒప్పందం కోసం ప్రయత్నిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ ప్రతిపాదనలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని, చర్చల ప్రక్రియలో ఆలస్యం ప్రమాదకరమని హెచ్చరించారు. 'ఒక్కసారి సైనిక చర్యలు ప్రారంభమైతే అమెరికా వెనుదిరిగే ప్రసక్తే లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ మిలిటరీ బలహీన స్థితిలో ఉందని ట్రంప్ అన్నారు. అయినప్పటికీ చర్చల విషయంలో ఇరాన్ తీరును విమర్శించారు. తమ ప్రతిపాదన కోసం ఎదురుచూస్తున్నామని ఇరాన్ చెబుతోందని, అయితే ఆలస్యం చేయడం వారికి మంచిది కాదని హెచ్చరించారు. చర్చలు త్వరగా ముగియాలని సూచించారు. మరోవైపు నాటో దేశాలపై కూడా ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఈ యుద్ధంలో నాటో దేశాలు సరైన సహకారం అందించలేదని ఆరోపించారు.

# ఎవరిపై వేటు?



**పీఠం ఎక్కేదెవరు.. కదిలేదెవరిది..**

**రేవంత్ కేబినెట్లో త్వరలో మార్పులు చేర్పులు**

**వివాదాస్పద మంత్రులకు చెక్.. కొత్తవారికి ఎంట్రీ**

- ఇప్పటికే అధిష్టానం ముందుకు మినిస్టర్స్ ప్రోగ్రెస్ రిపోర్ట్
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హైకమాండ్
- కొందరు మంత్రుల్లో మొదలైన గుబులు
- ఇద్దరు అమాత్యులపై వేటు తప్పదా?
- కేబినెట్ రేసులో చాలామంది ఆశావహులు
- ఢిల్లీ స్థాయిలో పైరవీలు
- సామాజిక సమీకరణకే పెద్దపీట

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయల్లో ఇప్పుడు ఒకటే చర్చ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన టీమ్‌ను ప్రక్షాళన చేయబోతున్నారా? అవుననే సమాధానమే రాజకీయ వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వం కొలువుదీరిన ఈ రెండున్నరేళ్ల కాలంలో పాలనపై ఒక స్పష్టమైన అవగాహనకు వచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన కేబినెట్‌ను మరింత పదును పెట్టేందుకు సిద్ధమయ్యారు. కేవలం ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు సరిగా లేని వారిని సాగనంపి, వివాదాస్పద నేతలకు చెక్ పెట్టడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన ముఖ్యమంత్రి, హైకమాండ్ నుంచి పూర్తి స్థాయిలో స్వేచ్ఛను పొందినట్లు సమాచారం. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో జరిగిన భేటీలో రాష్ట్రంలోని మంత్రుల ప్రోగ్రెస్ కార్డ్ ను సీఎం వారికి అందించినట్లు తెలుస్తోంది.

### వివాదాస్పదులకు చెక్

ఈ విస్తరణలో ప్రధానంగా ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులపై వేటు పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గత కొంతకాలంగా సదరు మంత్రులు వ్యవహరిస్తున్న తీరు అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణకు చెందిన ఒక మంత్రి, దక్షిణ తెలంగాణకు చెందిన మరొక మంత్రి తమ నియోజకవర్గాల్లోని గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం, అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి ఫిర్యాదులు అధిష్టానం దృష్టికి వెళ్లాయి. వీరిద్దరూ తమ వ్యక్తిగత అజెండాలకే ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్నారనే నివేదికల ఆధారంగా వీరిని తొలగించాలని రేవంత్ రెడ్డి గట్టి పట్టుదలతో ఉన్నట్లు సమాచారం. వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వారిని పక్కన పెడితేనే ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందని సీఎం భావిస్తున్నారు.

### ప ట్టుసాధించ ని శాఖల్లో మార్పు

మ రోవైపు, మ ంత్రివర్గంలో కొనసాగే మరికొంతమంది మంత్రుల శాఖల్లో భారీ మార్పులు ఉండబోతున్నాయి. కొందరు మంత్రులు తమకు కేటాయించిన శాఖలపై ఇప్పటికీ పట్టు సాధించలేకపోవడం, కీలకమైన ఫైళ్లను పరిష్కరించడంలో జాప్యం చేయడం వల్ల పాలన నెమ్మదించిందనే విమర్శలు ఉన్నాయి. ఆయా శాఖలను మరింత అనుభవజ్ఞులైన లేదా అత్యంత చురుగ్గా ఉండే నేతలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉంది. పనితీరు ఆధారంగానే పదవులు ఉంటాయని, శాఖల మార్పు అనేది కేవలం శిక్ష కాదని, పాలనా సౌలభ్యం కోసమేనని ముఖ్యమంత్రి ఇప్పటికే మంత్రులకు పరోక్షంగా సంకేతాలిచ్చారు. అసమర్థతకు చోటు లేదని స్పష్టం చేస్తూ, సమర్థవంతమైన టీమ్ తో ముందుకు వెళ్లాలనేది రేవంత్ మార్కు స్ట్రాటజీ.

### పాటించనున్న సామాజిక సమీకరణం

సామాజిక సమీకరణాల విషయంలో మాత్రం రేవంత్ రెడ్డి అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. మంత్రివర్గం నుంచి ఎవరిని తొలగించినా, ఆ స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన కొత్త నేతలను తీసుకురావాలనేది ఆయన ఆలోచన. ఉదాహరణకు ఒక బీసీ లేదా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మంత్రిని తొలగిస్తే, మళ్లీ అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు అవకాశం ఇవ్వడం ద్వారా ఆయా కులాల్లో అసంతృప్తి రాకుండా జాగ్రత్త పడుతున్నారు. రెడ్డి సామాజిక వర్గంలో కూడా ఇదే ఫార్ములా అమలు కానుంది. దీనివల్ల రాజకీయంగా ఎటువంటి నష్టం జరగకుండా, కేవలం వ్యక్తులను మాత్రమే మార్చి పనితీరును మెరుగుపరచడం సాధ్యమవుతుందని రేవంత్ రెడ్డి అధిష్టానాన్ని ఒప్పించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ రెండవ వారంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేసి, కొత్త టీమ్ తో రేవంత్ రెడ్డి సరికొత్త పాలనను ప్రారంభించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### ఆశావహుల ప్రయత్నాలు

మంత్రి పదవి రేసులో అందరికంటే ముందు వరుసలో వినిపిస్తున్న పేరు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చేటప్పుడే తనకు మంత్రి పదవి ఇస్తానని అధిష్టానం హామీ ఇచ్చిందని ఆయన గట్టిగా వాదిస్తున్నారు. అదేవిధంగా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేత పి. సుదర్శన్ రెడ్డి కూడా తన సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్ రెడ్డి రంగారెడ్డి పేరు కూడా బలంగా వినిపిస్తోంది. ఇక బీసీ కోటాలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరు పరిశీలనలో ఉంది. ప్రస్తుతం ఒక బీసీ మంత్రిని మార్చే అవకాశం ఉన్నందున, ఆ స్థానంలో మున్నూరు కాపు వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్‌కు చోటు దక్కవచ్చు. లంబాడ సామాజిక వర్గం నుంచి తమకు కూడా కేబినెట్‌లో చోటు కావాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, రామచంద్ర నాయక్ గట్టిగా కోరుతున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కే. ప్రేమ్ సాగర్ రావు కూడా మంత్రి పదవి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. వీరితో పాటు విజయశాంతి, మధుయాష్కీ గౌడ్ వంటి నేతలు కూడా సామాజిక సమీకరణాల దృష్ట్యా తమకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. మొత్తానికి, ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు, తొలగించబోయే మంత్రుల స్థానాలను కూడా కలిపి భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తుండటంతో, ఈ ఆశావహులందరూ ఇప్పుడు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఎవరికి అదృష్టం వరిస్తుందో తెలియాలంటే ఏప్రిల్ మొదటి వారం వరకు వేచి చూడాల్సిందే.

# నా మాటే శాసనం

## వివాదాస్పదంగా ఎనుగల్‌లో సర్పంచ్ వ్యవహార శైలి

- శ్రీరామ నవమి వేడుకల విషయంలో ఏకపక్ష ధోరణి
- వేదిక మార్పుపై గ్రామస్తుల ఆగ్రహం
- ఉగాదినాడు పురోహితుడితో ఘర్షణ..
- బాధితుడి ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో చికిత్స
- ఆనవాయితీని మారిస్తే ఊరుకోమని గ్రామస్తుల మండిపాటు



సర్పంచ్ వైఖరితో ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పురోహితుడు

**వేద న్యూస్, పర్వతగిరి**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఎనుగల్ గ్రామంలో సర్పంచ్ తొర్రి పద్మ వ్యవహారశైలి తీవ్ర వివాదాస్పదంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత 35 ఏళ్లుగా గ్రామ రెవెన్యూ పరిధిలోని 'వన్ మెట్టు' వద్ద శ్రీరామ నవమి కళ్యాణ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుండగా, ప్రస్తుత సర్పంచ్ పాలకవర్గంతో చర్చించకుండా వేదికను మార్చాలని నిర్ణయించడం గ్రామస్తుల ఆగ్రహానికి దారితీసింది. ఉగాది పంచాంగ శ్రవణం సందర్భంగా ఆలయ పురోహితుడు వెంకన్నచార్యులతో సర్పంచ్ ఘర్షణకు దిగినట్లు, వారిని అవమానించారని ఆరోపించారు. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన వెంకన్నచార్యులు పురుగుమందు తాగి ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. నేను చెప్పిందే శాసనం అంటూ సర్పంచ్ గ్రామస్తులను బెదిరిస్తున్నారని, సంప్రదాయాలను తుంగలో తొక్కడం సరికాదని వార్డు సభ్యుడు తొర్రి లక్ష్మణ్ యాదవ్‌తో పాటు గ్రామస్తులు మండిపడ్డారు. వెంకన్నచార్యుల వైద్య ఖర్చులను సర్పంచే భరించాలని, శ్రీరామ నవమి కళ్యాణాన్ని పాత పద్ధతిలోనే 'వన్ మెట్టు' వద్ద నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## వ్యవసాయ బావిలోకి దూకి..

# తల్లీ కొడుకుల మృతి

**వేద న్యూస్, ఇల్లంతకుంట**

కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లి, చిన్నారి కుమారుడు మృతి చెందిన విషాద ఘటన ఇల్లంతకుంట మండలం రంగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, దుర్మట్ల రేఖ (25)కు కొన్నేళ్ల క్రితం వివాహం కాగా, ఆమెకు విగ్నేష్ (4) అనే కుమారుడు ఉన్నాడు. భర్త తనను పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురైన రేఖ, ఎనిమిది నెలల క్రితం తన పుట్టినిల్లయిన రంగంపేటకు వచ్చింది. అయితే పరిస్థితుల్లో మార్పు రాకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు లోనైన ఆమె, బుధవారం సాయంత్రం తన కుమారుడితో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. మృతురాలి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.



## మార్కాపురంలో

# మృత్యుఘోష

- బస్సు-టిప్పర్ ఢీ.. 13 మంది సజీవ దహనం
- హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తుండగా రాయవరం వద్ద ఘోర ప్రమాదం



**వేద న్యూస్, మార్కాపురం**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మార్కాపురంలోని రాయవరం సమీపంలో ఈరోజు తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ప్రైవేట్ బస్సు, టిప్పర్ లారీ ఢీకొన్న ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. హైదరాబాద్ నుంచి పామూరుకు సుమారు 40 మంది ప్రయాణికులతో బయలుదేరిన ప్రైవేట్ బస్సు మార్కాపురం, రాయవరం సమీపంలోని క్వారీల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో బస్సు పూర్తిగా దెబ్బతింది. ప్రమాదం తర్వాత బస్సు డీజిల్ ట్యాంక్ పగిలిపోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వేగంగా వ్యాపించిన మంటలు క్షణాల్లోనే బస్సు, టిప్పర్‌ను చుట్టుముట్టాయి. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ సమయంలో ఎక్కువ మంది ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటంతో ప్రమాదాన్ని ముందుగానే గుర్తించలేకపోయారు. కొందరు అప్రమత్తమై బస్సు అద్దాలు పగలగొట్టుకుని బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే 10 మంది మాత్రం మంటల్లో చిక్కుకుని బయటపడలేక సజీవ దహనమయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని తక్షణమే మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ వైద్యులు తీవ్రంగా గాయపడిన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో వారి గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# తెలంగాణను నంబర్ వన్ చేసిన నేత కేసీఆర్

**– బీఆర్ఎస్ యువ నాయకుడు నరేష్ మైనాల**

**వేద న్యూస్, వరంగల్:**

తెలంగాణ రాష్ట్ర నిర్మాణం కేవలం భౌగోళిక మార్పు మాత్రమే కాదుడ అది ఒక ఆత్మగౌరవ ఉద్యమం అని, ఆ ఉద్యమానికి నేతృత్వం వహించి.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి నిర్ణయంలో కూడా ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనే రెండు ప్రధాన లక్ష్యాలను ముందుంచి గొప్పగా పరిపాలించిన నేత కేసిఆర్ అని బీ ఆర్ ఎస్ యువ లీడర్ నరేష్ మైనాల పేర్కొన్నారు. చంద్రశేఖర రావుప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం వెనుక ఒక బలమైన ఆలోచన, దీర్ఘకాల ప్రయోజనం ఉంటుందని చెప్పారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించిన పథకాల నుండి, పేదల జీవితాల్లో వెలుగు నింపిన సంక్షేమ కార్యక్రమాల వరకుడ ప్రతి రూపాయి ఖర్చు ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకొచ్చిందనీ వెల్లడించారు. ఆ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం దేశవ్యాప్తంగా ఒక ఆదర్శ రాష్ట్రంగా నిలిచి, ప్రపంచ పటంలో గర్వంగా నిలిచిందనీ పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాలనలో కనిపిస్తున్న విధానాలు ప్రజల శ్రేయస్సుతో పాటు రాజకీయ అవసరాల మధ్య సమతౌల్యం ఎంతవరకు పాటిస్తున్నాయనే ప్రశ్నలు ముందుకు వస్తున్నాయని, తాత్కాలిక ప్రయోజనాలు, దీర్ఘకాల అభివృద్ధి మధ్య సరైన సమన్వయం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోందనీ వివరించారు. కేసీఆర్ పెట్టిన ప్రతి రూపాయి రాష్ట్ర అభివృద్ధిలో, మౌలిక వసతుల పెరుగుదలలో, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలలో ప్రతిబింబించిందనీ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను పరిశీలించినప్పుడు అభివృద్ధి వేగం, అమలు విధానం వంటి అంశాలపై చర్చ జరగడం సహజమేనని,నేటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు గత పాలనలో అమలైన విధానాలు, ప్రస్తుత పాలనలో తీసుకుంటున్న నిర్ణయాలను పోల్చి చూసే దశలో ఉన్నాయని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాల్లో ఏ విధానం ఎంతవరకు ప్రభావవంతంగా ఉందనే అంశంపై సమాజంలో చర్చ



కొనసాగుతోందనీ తెలిపారు.మొత్తం మీద, తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో గత అనుభవాలు, ప్రస్తుత పరిస్థితులను సమతుల్యంగా అర్థం చేసుకోవడం అవసరం అని స్పష్టం చేశారు. ప్రజల ఆశలు, రాష్ట్ర అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా తీసుకునే నిర్ణయాలే తెలంగాణ ప్రగతికి దారితీస్తాయనీ వెల్లడించారు.

# వైద్య సేవల్లో ఆమె విజేత

**– దుర్గ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చక్కటి వైద్య సేవలు**
**– బెస్ట్ హెల్త్ సర్వీస్ అందిస్తున్నారని పలువురి ప్రశంస**




**వేద న్యూస్, జమ్మికుంట:**

వైద్యురాలిగా సేవాభావాన్ని చూపుతూ.. ఆచరణలో సేవారంగంలో విజేతగా నిలుస్తున్నారు ఆమె.. ప్రజలకు సేవ అందించాలనేదే ధ్యేయంగా ముందుకుసాగుతున్న ఆమె ఇంకెవరో కాదు.. ప్రముఖ ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. విజేతరెడ్డి ఎండీ రెస్పిరేటరీ మెడిసిన్. ఛాతికి సంబంధించిన వ్యాధుల ట్రీట్మెంట్ విషయంలో జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సుదూరంగా వెళ్లకుండా అందుబాటులోని పట్టణంలోని దుర్గ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఆమె అందుబాటులో ఉంటున్నారు. నైపుణ్యం కలిగిన వైద్యురాలు అర్హతతో పాటు నైపుణ్యం కలిగిన వైద్యుల వద్దనే రోగులకు నాణ్యమైన వైద్యంఅందుతుందని పలువురు చెబుతుంటారు. ఆ మేరకు నాణ్యమైన ట్రీట్మెంట్ అందించేందుకు దుర్గ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలోని వైద్యురాలు విజేతరెడ్డి కృషి చేస్తారు. రోగికి సంబంధించిన ఇబ్బందిని గురించి సమగ్రంగా తెలుసుకున్న తర్వాతనే వైద్యురాలు చికిత్స అందిస్తారు. జ్వరం, దగ్గు, (ఉబ్బసం), పిల్లికూతలు, తుమ్ములు, ముక్కుకారడం, ఛాతి నొప్పి, న్యూమోనియా, సిగరెట్ వల్ల వచ్చే డిసీజెస్, దగ్గితే రక్తం పడటం, నిద్రలో వచ్చే గురక(ఓఎస్ఏ), సీఓపీడీ, ఐఎల్డీ, అలర్జీ, పక్కటెముకలు విరుగుట, చాతిలో రక్తం చేరుట, ఇతర శ్వాసకోస సంబంధితవ్యాధులకు సంబంధించి వైద్యాన్ని విజేత అందిస్తారు. దుర్గ మల్టీ స్పెషాలిటీ అన్ని రకాల ఎమర్జెన్సీ పేషెంట్లను తీసుకుంటామని, వారికిచక్కటి వైద్యం అందించడమే లక్ష్యంగా పె ముందుకు సాగుతున్నట్టు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది మానవతా దృక్పథంతో, సేవాభావంతో రోగులకు సేవలందిస్తున్నట్టు దుర్గ ఆస్పత్రి ఎండీ(మేనేజింగ్ డైరెక్టర్) పి. కిరణ్ గౌడ్ పేర్కొన్నారు.



# సైనిక్ స్కూల్‌కు ఆర్వో ప్లాంట్, ఫర్నిచర్ అందజేత

**– రూ.4 లక్షల విలువైన సామగ్రి సైతం**
**– విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన**

**వేద న్యూస్, చొప్పదండి:**

టీజీఎస్‌డబ్ల్యూఆర్ సైనిక్ స్కూల్, రుక్మాపూర్‌కు వేలగ్రో బయో సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్, టేబుల్స్, ఐరన్ చైర్లు అందజేశారు. సుమారు రూ.2.5 లక్షల విలువైన గంటకు 1000 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఆర్వో ప్లాంట్‌తో పాటు రూ.1.7 లక్షల విలువైన 40 టేబుల్స్, 40 ఐరన్ చైర్లను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, రోగులకు సహాయం అందించడం తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్. ప్రసాద్ బాబు, జి. శ్యామ్




శంకర్, డి. అవినాష్ పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ వి. లింగయ్య, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

**– పెన్నా సీడ్స్ జోనల్ మేనేజర్ మహమ్మద్ ఆఫ్సర్ ఆలీ**
**– రైతుల మొక్కజొన్న క్షేత్రస్థాయి సందర్శన**

**వేద న్యూస్, నల్లబెల్లి:**




నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడం ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని పెన్నా సీడ్స్ జోనల్ మేనేజర్ మహమ్మద్ ఆఫ్సర్ ఆలీ తెలిపారు. నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లి గ్రామంలో రైతు గణపతి రెడ్డి సాగు చేసిన 'పెన్నా సీడ్స్ 3422' మొక్కజొన్న పంటను కంపెనీ ప్రతినిధులు, రైతులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆఫ్సర్ ఆలీ మాట్లాడుతూ.. 3422 రకం మొక్కజొన్న అధిక దిగుబడితో పాటు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉందన్నారు. గింజ నాణ్యత మెరుగ్గా ఉండటం వల్ల మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని వివరించారు. రైతు పొలంలో పంట పెరుగుదల చూసిన రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సాగు విధానాలపై కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేల్స్ మేనేజర్ శ్రీరామ్ రెడ్డి, డిస్ట్రిబ్యూటర్ రమేష్ బాబు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# హనుమాన్ మాలధారుల ఆందోళన

**– విగ్రహం తొలగింపుపై భక్తుల నిరసన**
**– పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి**




**వేద న్యూస్, మెట్‌పల్లి:**

మెట్‌పల్లి బస్టాండ్ సమీపంలో ఉన్న హనుమాన్ విగ్రహాన్ని తొలగించారని ఆరోపిస్తూ హనుమాన్ మాలధారులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని భక్తులను సముదాయించారు. ఈ సందర్భంగా భక్తులు జై హనుమాన్ నినాదాలతో తమ ఆందోళన వ్యక్తం చేశారు. తరువాత అదే స్థలంలో హనుమాన్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వేములవాడలో సీతారాముల కల్యాణోత్సవాలు

**– 8వ రోజు వైభవంగా పూజలు, అభిషేకాలు**
**– యాగశాలలో హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా 8వ రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతా రామచంద్ర స్వామివారికి పంచోపనిషత్ విధానంలో అభిషేకం నిర్వహించగా, అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి, పరివార దేవతలకు అర్చనలు చేశారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా యాగశాలలో పుణ్యాహవచనం, మూలమంత్ర హోమం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కన్యాదాతలుగా మరిగంటి విజయసారథి-కర్ణ దంపతులు పాల్గొన్నారు. శ్రీరామ నవరాత్రి సందర్భంగా రామాయణ పారాయణాలు కొనసాగుతుండగా, సాయంత్రం శంకరమఠంలో రామాయణ ప్రవచనం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు

# వేములవాడలో తైబజార్, మున్సిపల్ షాపుల వేలం పూర్తి

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని తైబజార్ వసూళ్లు, జాతర గ్రౌండ్ వద్ద గల మున్సిపల్ షాపుల కోసం బహిరంగ వేలం పాటలు గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ సంపత్ కుమార్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. తైబజార్ వేలంలో 8 మంది పోటీదారులు పాల్గొనగా, సామల శివాని అత్యధికంగా రూ.21,11,632కు హక్కులను దక్కించుకున్నారు. అనంతరం మున్సిపల్ షాపు వేలంలో 5 మంది పాల్గొనగా, ఆకారం వినయ్ రూ.2,34,000కు కైవసం చేసుకున్నారు. మున్సిపల్ ఆదాయాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం నిబంధనల మేరకు ఈ వేలం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీలో చొప్పదండి సమస్యల ప్రస్తావన

**వేద న్యూస్, గంగాధర:**



చొప్పదండి నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్య సమస్యలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసెంబ్లీలో ప్రస్తావించారు. అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నారాయణపూర్ రిజర్వాయర్ కింద గ్రామాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ముంపు గ్రామంగా ప్రకటించి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామడుగు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# వేములవాడ రూరల్ సమస్యలపై బీజేపీ ఆందోళన

**– అధికారుల నిర్లక్ష్యంపై పరమేష్ విమర్శలు**



**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

వేములవాడ రూరల్ మండలంలో నెలకొన్న పలు సమస్యలపై బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిరహించారు. ఈనెల 17న ఎమ్మార్వోకు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మూలవాగు ప్రాంతంలో అధిక ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, రైతులు తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఇసుక రీచ్‌లను వెంటనే ఇతర ప్రాంతాలకు మార్చాలని, ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే చెక్‌డ్యామ్‌లు పూర్తి కాకపోవడం, రోడ్లు దెబ్బతినడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

వేద న్యూస్

శుక్రవారం మార్చి 27, 2026

# కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ప్రాచీన కళలను పరిరక్షించాలి
- రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి



**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర ఆధారంగా నాటక ప్రదర్శన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి మాట్లాడుతూ, నాటక రంగ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి జీవనోపాధి కల్పించాలని కోరారు. ప్రాచీన కళలు కనుమరుగవకుండా సంరక్షించడం అవసరమని పేర్కొన్నారు. గత 32 సంవత్సరాలుగా నిరంతరంగా ఈ నాటక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కళాకారులు తమ అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, ప్రజాప్రతినిధులు, ప్రేక్షకులు పాల్గొన్నారు.

# గాయపడిన కార్మికుడికి పూర్తి వైద్య ఖర్చులు భరించాలి

- సీఐటీయూ నేతలు



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కార్మికుడికి పూర్తి వైద్య ఖర్చులు భరించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. 8వ డివిజన్ అలుగునూరులో వీధి దీపాల మరమ్మతుల సమయంలో సాయువేణి శివకృష్ణ అనే కార్మికుడు విద్యుత్ ప్రమాదానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్స ఖర్చులు మున్సిపల్ కార్పొరేషన్ భరించడంతో పాటు కోలుకునే వరకు జీతం చెల్లించాలని కోరారు. ఈ మేరకు కమిషనర్ ప్రపుల్ దేశాయ్‌కు వినతిపత్రం అందజేయగా, ఆయన వెంటనే స్పందించి డీఎంహెచ్ఓతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు నివారించేందుకు కార్మికులకు రక్షణ పరికరాలు, హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వరద కాలువలో నీరు.. రైతుల్లో ఆనందం

- ఎమ్మెల్యే కృషితో సాగునీరు విడుదల



**వేద న్యూస్, గంగాధర:**

చొప్పదండి నియోజకవర్గంలో వరద కాలువలో నీరు ప్రవహించడం రైతులకు ఆనందాన్ని కలిగించింది.

సాగులో చివరి దశలో ఉన్న పంటలకు ఈ నీరు కీలకంగా మారింది. ఇటీవల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వరద కాలువకు నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి కాలువకు నీరు విడుదల చేశారు. గంగాధర మండలం కొండన్నపల్లి వద్ద రైతులు, కాంగ్రెస్ నాయకులు పూజలు నిర్వహించి గోదారమ్మకు స్వాగతం పలికారు. సకాలంలో నీరు విడుదల చేయించిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు

- జైలు శిక్ష తప్పదని పోలీసుల హెచ్చరిక
- 22 మందికి జరిమానాలు




**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 22 మంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ జయశ్రీ వివిధ మొత్తాల్లో జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష, భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మళ్లీ తప్పు చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. మద్యం సేవించి వాహనం నడిపితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, పోలీస్ వెరిఫికేషన్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రేణుక ఎల్లమ్మ దేవాలయం హుండీ లెక్కింపు

- గతంతో పోలిస్తే పెరిగిన భక్తుల విరాళాలు



**వేద న్యూస్, హుస్నాబాద్:**

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. మూడు నెలల కాలంలో మొత్తం రూ. 1,29,860 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంతో పోలిస్తే ఈసారి హుండీ ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ పి. కిషన్ రావు, దేవాదాయ శాఖ పర్యవేక్షకులు కే. శ్రీధర్ రెడ్డి, గోమాత సేవా సమితి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# నందరాంలో సీసీ కెమెరాల ఏర్పాటు



**వేద న్యూస్, హుస్నాబాద్:**

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నందరాం గ్రామంలో నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీలత-బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలను సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, సీసీ కెమెరాలు గ్రామ భద్రతకు ఎంతో ఉపయోగకరమని, దొంగతనాలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఏదైనా ఘటన జరిగినా కెమెరాల ఆధారంగా నిందితులను సులభంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. గ్రామంలో భద్రత మరింత మెరుగుపడుతుందని సర్పంచ్, ఉప సర్పంచ్ లింగయ్య, వార్డ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రగతి పాఠశాలలో 'ఉత్కర్ష్' వార్షికోత్సవం

- విద్యతో పాటు సంస్కారం అవసరమని విద్యావేత్తల సూచనలు




**వేద న్యూస్, రామడుగు:**

రామడుగు మండలం గోపాల్రావుపేటలోని శ్రీ ప్రగతి పాఠశాలలో 'ఉత్కర్ష్' వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యావేత్తలు, అతిథులు విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని సూచించారు. పిల్లలు చదువుతో పాటు సంస్కారం, విలువలు నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు వారితో స్నేహపూర్వకంగా ఉండాలని అన్నారు. చిన్న వయసులోనే హాస్టల్‌లకు పంపకుండా, కుటుంబంలోనే పెంచితే జీవన విలువలు అర్థమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చిన్నారులు ఆలపించిన గోవింద నామాలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ వేడుకలకు ట్రస్మా రాష్ట్ర నాయకులు యాదగిరి శేఖర్ రావు, ఎంఈఓ రంగనాథ శర్మ, సర్పంచ్ వనజా రెడ్డి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

# రామోజీపేటలో పట్టు వస్త్రాల సమర్పణ

- కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

శ్రీరామనవమి సందర్భంగా రామోజీపేట గ్రామంలోని శ్రీ సీతారామ స్వామి ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఆయన సతీమణి విద్య దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న వారు స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు సమర్పించగా, అర్చకులు వేదోక్త ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం జామ మజీద్ నూతన కమిటీ ఎన్నిక



**వేద న్యూస్, మహాదేవపూర్ :**

మహాదేవపూర్ మండలం కాళేశ్వరం జామా మజీద్‌లో నూతన కమిటీ గురువారం రోజున ఏర్పాటు చేయడం జరిగింది. మస్జిద్ ఇమామ్ సయ్యద్ నిసార్, మౌజన్ సయ్యద్ షఫీక్, మాజీ ప్రెసిడెంట్ సయ్యద్ అమీన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెక్రటరీ సయ్యద్ ఫరీద్, ఎండి నబి, సయ్యద్ పాషా, మహబూబ్, సయ్యద్ ముస్తాక్, సయ్యద్ కాజా పాషా ఇతర సభ్యుల సమక్షంలో ఈ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో సయ్యద్ హమీద్ అందరి మత పెద్దల సమక్షంలో కాలేశ్వరం జామే మజీద్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సయ్యద్ హమీద్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన మత పెద్దలు మరియు సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మస్జిద్ అభివృద్ధి మరియు సమాజ సేవలో అందరితో కలిసి పనిచేస్తానని తెలిపారు.

# ఘనంగా కొండా సుష్మిత పటేల్ పుట్టినరోజు వేడుకలు



- శ్రీరాం రాజేష్ ఆధ్వర్యంలో

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

కొండా దంపతుల రాజకీయ వారసురాలు కొండా సుస్మిత పటేల్ (చిట్టక్క ) జన్మదిన సందర్బంగా 34,35 డివిజన్ జీబుల అడ్డా వద్ద కాంగ్రెస్ నగర నాయకులు శ్రీరాం రాజేష్, పగడాల సతీష్ యాడ్ కేక్ కట్టింగ్, మహా అన్నదాన కార్యక్రమం నిర్యహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అధితిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ కొండ సురేఖ రాజకీయ వారసురాలైన సుస్మిత పటేల్ (చిట్టక్క) ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటూ రానున్న రోజుల్లో మంచి పదవులు రావాలని ఆశిస్తున్నానన్నారు.

# న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు సంగెం అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలకగా, ముందుగా సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. అనంతరం సీపీ పోలీస్ స్టేషన్‌ను సమగ్రంగా పరిశీలించిన కమిషనర్, స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ప్రజల జీవన విధానం, స్థానికంగా జరుగుతున్న నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులపై వివరాలను ఇన్స్‌పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ సిబ్బంది పనితీరు, బీట్ వ్యవస్థ, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం స్టేషన్‌లో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టుకు సంబంధించిన అంశాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా పనిచేయాలని అంతేకాకుండా ఫిర్యాదుల పై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించాలని సీపీ సూచించారు.

వేద న్యూస్

శుక్రవారం మార్చి 27, 2026

# ఎర్రబెల్లి స్వర్ణని మర్యాదపూర్వకంగా కలిసిన ఫోటో,వీడియో జర్నలిస్టులు



**వేద న్యూస్, హన్మకొండ :**

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియామకం అనంతరం, ఎర్రబెల్లి స్వర్ణ నివాసంలో ఫోటో అండ్ వీడియో జర్నలిస్ట్ సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు అభినందనలు తెలియజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గోపరాపు శ్యామ్ కుమార్, అధ్యక్షులు సంపేట సుధాకర్, కార్యదర్శి బొల్లా అమర్ మరియు కార్యవర్గ సభ్యులు బొడిగె శ్రీను తోట తిరుమల్ చేతి శ్రీనివాస్ నామాని రమేష్ లు పాల్గొన్నారు.

# కాళేశ్వరాలయ హుండీ లెక్కింపు

**వేద న్యూస్, మహాదేవపూర్ :**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయ హుండీలను గురువారం కార్యనిర్వాహణ అధికారి ఎస్ మహేష్ ఆధ్వర్యంలో లెక్కించడం జరిగింది. రెండు నెలల పది రోజులకు గాను 22 లక్షల 93, 076, రూపాయలతోపాటు యుఎస్ఎ 61 డాలర్లు కానుకల రూపంలో భక్తులు స్వామివారికి సమర్పించుకోవడం జరిగిందని ఆలయ కార్యనిర్వాహన అధికారి ఎస్ మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణ అధికారి ఎం అనిల్ కుమార్,సర్పంచ్ వెన్నపరెడ్డి మోహన్ రెడ్డి,ఉప సర్పంచ్ చెమ్మల సుదీర్ యూనియన్ బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది, శ్రీవల్లి సేవా ట్రస్ట్, శ్రీ వెంకట అన్నమాచార్య సేవాసమితి సభ్యులు, నరసింహా సేవా సమితి సభ్యులు, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు

# సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

**– భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపు**

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలోని శ్రీ సీతారాముల ఆలయంలో శుక్రవారం యంగ్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. శ్రీరామనవమి హిందువులకు ముఖ్యమైన పండుగగా, చైత్ర శుద్ధ నవమి రోజున నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణం ఎంతో వైభవంగా జరుపుకుంటారని తెలిపారు.

# కురుమ సంప్రదాయాలకు రక్షణ కల్పించాలి

**– అసెంబ్లీలో ఎమ్మెల్యే సంజయ్**

**వేద న్యూస్, మెట్‌పల్లి:**



తెలంగాణ రాష్ట్రంలోని కురుమ సోదరుల సాంప్రదాయ ఆచారాలకు ప్రభుత్వ రక్షణ కల్పించాలని కొరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అసెంబ్లీలో కోరారు. జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తుతూ కురుమల జీవనశైలి, వారి ఆచారాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే బీరప్ప స్వామి కళ్యాణం వందల ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జరిగే 'గావు పట్టడం'పై అవగాహన లేక కొందరు ఫిర్యాదులు చేయడం వల్ల కురుమలపై కేసులు నమోదవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కురుమలు శాంత స్వభావులని, వారి ఆచారాలకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ అంశంపై ప్రత్యేక చర్చ జరిపి వారికి భరోసా కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పీకర్ హామీ ఇచ్చారు.

# అభివృద్ధి పనులకు ప్రజల సహకారం అవసరం

- **చైర్‌పర్సన్ నాగమణి**
- **ఆత్మకూరులో రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్ ప్రారంభం**

**వేద న్యూస్, దేవరకద్ర/ఆత్మకూరు:**

ఆత్మకూరు పట్టణ అభివృద్ధి కోసం చేపడుతున్న పనులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గోపాల నాగమణి రాజేష్ కోరారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. గాంధీ చౌరస్తా నుంచి పీజేపీ క్యాంప్ వరకు రోడ్డు ఇరువైపులా 33 అడుగుల మేర మార్కింగ్ చేసి వైడెనింగ్ పనులు చేపడతామని చెప్పారు. అభివృద్ధి పనులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, కమిషనర్ శశిధర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

- **112 మందికి జరిమానాలు**
- **పట్టుబడిన వారికి పోలీసుల కౌన్సెలింగ్**



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ పట్టణంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 112 మంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి 86 మందికి ఒక్కొక్కరికి రూ.5వేలు, 26 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా టౌన్ సి.ఐ వీరప్రసాద్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుబడిన వారికి ఎస్ఐ రామ్మోహన్, ట్రాఫిక్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి మళ్లీ తప్పు చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, పోలీస్ వెరిఫికేషన్‌లో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# వడదెబ్బతో కూలీ మృతి..

- **ఆరు నెలల్లో తండ్రీ, కూతురు మరణం**
- **కనగర్తిలో విషాదం**

**వేద న్యూస్, కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావు పేట మండలం కనగర్తి గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న కూలీ పులి రవి (38) వడదెబ్బకు గురై మృతి చెందడం విషాదాన్ని మిగిల్చింది. ఎండ తీవ్రతకు తట్టుకోలేక అస్వస్థతకు గురైన రవిని తోటి కూలీలు ఆసుపత్రికి తరలించేలోపే మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు సమాచా రం. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఇప్పటికే ఆరు నెలల క్రితం తన చిన్న కూతురిని కోల్పోయిన కుటుంబం, ఇప్పుడు రవి మరణంతో తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. భార్య నిర్మల, చిన్నారి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ ఆపదలో ఉన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుక సరఫరా

- **'మన ఇసుక వాహనం' సేవలు ప్రారంభం**
- **అక్రమ రవాణాపై కఠిన చర్యలు**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి 'మన ఇసుక వాహనం' ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక సరఫరా ప్రారంభమవుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో మాట్లాడిన కలెక్టర్.. అనుమతించిన ఇసుక రీచ్‌ల నుంచే సరఫరా జరగాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి అక్రమ తవ్వకాలు, రవాణాపై కఠిన నిఘా ఉంచాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**– ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక**

**వేద న్యూస్, హన్మకొండ :**




వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక అన్నారు. న్యూశాయంపేట పరిధిలో పోచంపల్లిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ వెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం 3వ రోజు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ప్రభుత్వ పాఠశాల పోచంపల్లి ప్రాంతంలో పిచ్చి మొక్కలు, ముళ్ళ మొక్కలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతుందని, కావున పరిసరాల పరిశుభ్రత పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వయ్యారిభామ వంటి మొక్కల నుంచి విడుదల అయ్యే పరాగరేణువుల వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు సుజాత, జిపిఎస్ హెడ్మాస్టర్ జి ఉప్పలయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**సబ్ కలెక్టర్ వికాస్ మహతో**



**వేద న్యూస్, కోటగిరి :**

విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో గల ఎంపీయూపీఎస్ పాఠశాలను గురువారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. ఈ సందర్బంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను సబ్ పరిశీలించారు. విద్యార్థుల గైర్హాజరును తగ్గించడంపై దృష్టి సారించాలని, విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థుల ఎండ్ లైన్ పరీక్ష పత్రాలను సమీక్షించారు. విద్యార్థులు చదవడం, రాయడం నైపుణ్యాలను కూడా అంచనా వేసి, ప్రత్యేక కృషి ద్వారా మెరుగుపరచుకోవాలని సూచించారు. సబ్ కలెక్టర్ వెంట తహశీల్దార్ గంగాధర్, ఎంఈవో శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# కౌకుంట్లలో చలివేంద్రం ప్రారంభం

**– ప్రజల దాహం తీర్చేందుకు గ్రామపంచాయతీ చర్యలు**



**వేద న్యూస్, దేవరకద్ర/కౌకుంట్ల:**

దేవరకద్ర నియోజకవర్గంలోని కౌకుంట్ల మండల కేంద్రంలో ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. సర్పంచ్ ఉల్లి నరేష్ కుమార్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రతి ఒక్కరికీ తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చలివేంద్రం ద్వారా గ్రామ ప్రజలు, ప్రయాణికులు ఉపశమనం పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర దేవాలయ హుండీ లెక్కింపు

## - గత ఏడాది కంటే రెట్టింపు ఆదాయం



**వేద నల్గొండ,ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ రామలింగేశ్వర జాతర సందర్భంగా గురువారం ఉదయం దేవాలయ ఇంచార్జ్ మేనేజర్ మృత్యుంజయ శాస్త్రి, దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్ నేతృత్వంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ఇంచార్జ్ మేనేజర్ మృత్యుంజయ శాస్త్రి మాట్లాడుతూ దేవాలయ అభిషేకాలు 2400,కట్నాలు 16700, కళ్యాణం టికెట్లు19000 దర్శనాలు 22000 అలాగే హుండీ 48549 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.జాతర మొత్తం ఆదాయం 1లక్ష 20 వేల99 రూపాయలు వచ్చిందని పేర్కొన్నారు.గత ఏడాది కంటే రెట్టింపు ఆదాయం వచ్చిందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లల సందీప్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, దేవాలయం ఇన్స్పెక్టర్ సంతోష్ రెడ్డి, దేవాలయ అర్చకులు మణిశర్మ, ధర్మకర్తలు కోల వెంకన్న, కత్తుల లింగయ్య, బచ్చు జానయ్య, బసరాజు నాగయ్య,నాయకులు ఓబీసీ మండల నాయకులు కోల పెద్ద సైదులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సాధించాలి

## - కలెక్టర్ కుమార్ దీపక్



**వేద న్యూస్, మందమర్రి :**

పారిశుద్ధ్యంపై ప్రత్యేకమైన దృష్టి సాధించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించార. యాపల్ ఏరియాలో జరుగుతున్న శుభ్రత కార్యక్రమాలను తనిఖీ చేసి, పనుల పురోగతిపై అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. మండల కేంద్రంలోని చత్లాపూర్ గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డ్ ను స్థానిక మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్, స్థానిక అధికారుల తో క్షేత్రస్థాయిలో ఆకస్మితంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. చెత్త నిర్వహణ విధానాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఇంటి పన్నుల వసుళ్ళ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకుని, వసూళ్లను మరింత వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి పి కృష్ణ ప్రసాద్, ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ ఈ సంపత్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యం గోపికృష్ణ, తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారి విస్తరణలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



## - కలెక్టర్ కుమార్ దీపక్

**వేద న్యూస్, మందమర్రి :**

జాతీయ రహదారి 63 విస్తరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండలం తిమ్మాపూర్ ప్రాంతంలో ఆర్మూర్ నుండి చంద్రాపూర్ జాతీయ రహదారి 63 పనులను మండల తహసిల్దార్ సతీష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును మండల తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను నిబంధనలకు లోబడి చేపట్టేలా అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డును సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. నివాసాల నుండి సేకరించిన చెత్తలో ఉపయోగకరమైన వాటిని వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమం సంబంధిత అధికారు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలి

## - మద్యం, సెల్ ఫోన్, అతివేగంతోనే ప్రమాదాలు : ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్




**వేద న్యూస్,పాపన్న పేట :**

రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమా దాలకు దూరంగా ఉండాలని పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అర్రేవ్ అ లీవ్" కార్యక్రమం లో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఉపసర్పంచ్, వార్డు సభ్యుల కు శిక్షణ కార్యక్రమంలో భాగంగా "అరైవ్ -అలైవ్" అవగా హన కల్పించారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ లలో ప్రజలకు ప్రమాదాల నివారణకు తమ వంతుగా ప్రజలకు రోడ్డు భద్రత, నియమాలు, నిబంధనల పై అవగాహన కల్పించాల ని సూచించారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు ఎంతో ప్రాధాన్యత నిచ్చి అరైవ్- అలైవ్ కార్యక్రమం తో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలన్న తలంపుతో చేపట్టిన వారోత్సవాల్లో బాగంగా మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు గురువారం ప్రజా ప్రతినిధులను సైతం అవగాహన సదస్సులో భాగస్వాములుగా చేయాలన్న తలంపుతో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తోపాటు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ,హెల్మెట్, సీటుబెల్టు ఉపయోగించక పోవడంవల్ల జరుగు తున్నాయన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలంపోలీసుల బాధ్యత మాత్ర మే కాదని ప్రతి వాహనదారుడు ప్రతి పౌరుడు బాధ్యత గావ్యవహరించినప్పుడే ప్రమాదాలనుగణనీయంగా తగ్గించవచ్చునని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వారికి సూచించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు రాంగ్ రూట్లో నడపకూడదని తెలియజేశారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ఫోన్లను ఉప యోగించొద్దని, సెల్ ఫోన్ లో ఇతరులతో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలని సూచించారు. చలికాలంలో మంచు కారణంగా ఓవర్టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఇఓ , వివిధ గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, శిక్షకులు పోలీసులు ఉన్నారు.

# రామ్ చరణ్ జన్మదిన సందర్భంగా
# రక్తదాన శిబిరం ఏర్పాటు



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ జన్మదిన పురస్కరించుకొని చిరంజీవి రాష్ట్ర అధ్యక్షులు కొయ్యడ ప్రభాకర్ అలియాస్ కరాటే ప్రభాకర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మంచి సంకల్పంతోటి ప్రాణం పోయే పరిస్థితిలో రక్తం అవసరమనే గుర్తించి చిరంజీవి బ్లడ్ బ్యాంకు ద్వారా ఎన్నో లక్షల మందికి ప్రాణదానం చేయడం గొప్ప విషయం అన్నారు. రక్తదానం అంటే ప్రాణదానమని గుర్తించి తన అభిమానులే కాకుండా చాలామంది చిరంజీవి బ్లడ్ బ్యాంకు ద్వారా తమ రక్తాన్ని అందజేసి ఎంతో మందికి రక్తంలో అందుబాటులో ఉంచి ప్రాణాలు కాపాడుతున్న ఈ మంచి కార్యక్రమంలో ఏర్పాటు చేసినందుకు కరాటే ప్రభాకర్ని అభినందించారు.

# గర్భిణీకి రక్తదానం..

## - ప్రాణం కాపాడిన యువశక్తి ఫౌండేషన్
## - అత్యవసర సమయంలో స్పందించిన సభ్యులు




**వేద న్యూస్, దేవరకద్ర:**

ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణ ీకి యువశక్తి ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేసి ప్రాణం కాపాడిన సంఘటన చోటు చేసుకుంది. జన ంపేట గ్రామానికి చెందిన శ్రీలత డెలివరీ కోసం పాలమూరు జిల్లా ఆసుపత్రిలో చేరగా, అధిక రక్త స్రావం కారణంగా వెంటనే ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. బ్లడ్ బ్యాంకులో రక్తం లభించక పోవడంతో కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు కాగితాల మధును సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి ఫౌండేషన్ సభ్యురాలు వైష్ణవితో రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఫౌండేషన్కు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యవంతమైన యువత ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని మధు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల పరీక్షలో శ్రీ సాయి స్కూల్ ప్రభంజనం




**వేద న్యూస్,పాపన్నపేట :**

తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీ సాయి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుండి 11 మంది విద్యార్థులు ఫిబ్రవరి 22 న ప్రవేశ పరీక్షలకు హాజరు కాగా రాష్ట్ర ప్రభుత్వ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసింది. ఈ ఫలితాల్లో శ్రీ సాయి స్కూల్ నుండి మొదటి విడత జాబితాలో 11మంది విద్యార్థులు 5 వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ విజయం కోసం కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల యాజమాన్యం భాస్కర్, నరేష్, మహేష్, శివలు అభినందించారు.

**నవోదయ కు శ్రీ సాయి స్టూడెంట్ ఎంపిక**

అలాగే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నవోదయ ఫలితాలు పాపన్నపేట మండలం నార్సింగ్ శ్రీ సాయి స్కూల్ విద్యార్థి వైష్ణవి ఎంపికైంది. గతేడు భానుతేజ నవోదయ ఎంపిక కాగా ఈ సంవత్సరం వైష్ణవి ఎంపిక కావడం పట్ల విద్యార్థులు తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

# కన్నుల పండువగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం



**వేద న్యూస్, పాపన్నపేట :**

మండల కేంద్రం పాపన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం మహా సుదర్శన యాగం, అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై పుణ్యావాచనం, నవగ్రహ వాస్తు ఆరాధన, పూర్వక మహా సుదర్శన యాగం అనంతరం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం కన్నుల పండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ తంతును కనులారా తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం మార్చి 27, 2026

## అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన సర్పంచ్

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలోని మూడు అంగన్వాడీ కేంద్రాలను గురువారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు, గర్భిణీ మహిళలకు గుడ్లు, పాలతో పాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్వాడీ టీచర్లు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు

**వేద న్యూస్, పోతంగల్ :**



పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ఉదయభాస్కర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 102 మందికి పరీక్షలు నిర్వహించగా, 22 మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. వీరికి శాస్త్ర చికిత్స కోసం బోధన్ కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో హంగర్గ సర్పంచ్ ఉదయ్ భాస్కర్, కంటి వైద్య సహాయకులు అజయ్, భీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్ ,లయన్స్ క్లబ్ క్యాంప్ ఇంచార్జ్ హన్మంతు రావ్ పటేల్, హన్మండ్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలు తనిఖీ చేసిన ఎంపిడిఓ

**వేద న్యూస్, పోతంగల్ :**



ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండలంలోని హొగ్డోలి, సోంపూర్, టాక్లి, దోమలేడ్గి, సుంకిని గ్రామాలల్లో అంగన్వాడి కేంద్రాలను ఎంపీడీవో చందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు, గర్భిణీలకు అందించే పౌష్టికాహార సామాగ్రి నాణ్యతను పరిశీలించారు. చిన్నారుల హాజరు పట్టిక, అంగన్వాడి రికార్డులను తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే నిత్యవసర సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఎంపిడిఓ వెంట ఆయా గ్రామాల సర్పంచులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటరమణ, అంగన్వాడి టీచర్లు తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**– బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**




అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గత పదకొండు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపట్టిన సీనియర్ జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబుకు బహుజన్ సమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జర్నలిస్ట్ రాంబాబును గురువారం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బొడ్డు బాబురావు.. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయి స్తామని తన మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేశారు. అదేవిధంగా ఖమ్మంలో ప్రభుత్వం ఏర్పడక ముందే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇండ్లు కూడా కట్టించి ఇస్తామని మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డితో పాటు మిగతా ఇద్దరు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క లు ఇచ్చిన హామీలను కూడా ఆయన గుర్తు చేశారు. కానీ జర్నలిస్టులకు మాత్రం ఇళ్ల స్థలాలు ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 23.02 ఎకరాల భూమిని జర్నలిస్టులకు కేటాయించినప్పటికీ ఈ ప్రభుత్వం ఇవ్వడానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి జాప్యం చేస్తుందని విమర్శించారు. న్యాయబద్ధంగా వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలను ఇప్పించాలని, అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డుల ఆలస్యం తన అసమర్థతకు నిదర్శనమన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే రేపటి భవిష్యత్తు ప్రశ్నార్థకమే అన్నారు.పదే పదే హామిలిచ్చి జర్నలిస్టులను మోసం చేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. జర్నలిస్టు యూనియన్లు మద్దతు తెలిపి ఆయన పోరాటంలో భాగస్వామ్యమై ఇండ్ల స్థలాలు సాధించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా రాంబాబుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి విజయం సాధించాలని బొడ్డు బాబూరావు ఆకాంక్షించారు.

## బ్రిడ్జి కట్టారు సరే..ఆ తాటి చెట్ల మాటేమిటి..?

**వేద న్యూస్,కారేపల్లి :**



అభివృద్ధి పనులు అంటే ప్రజల సౌకర్యం కోసం ఉండాలి కానీ, వారి ప్రాణాలను పణంగా పెట్టేలా ఉండకూడదు. కారేపల్లి మండల కేంద్రంలో సీతారాంపురం నుండి లాల్ తండాకు వెళ్లే ప్రధాన రహదారిపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులే ఇందుకు నిదర్శనం. ఇక్కడ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నా, రహదారికి అడ్డంగా ఉన్న తాటి చెట్లను తొలగించడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా రహదారి విస్తరణ జరిగినప్పటికీ, పాత రోడ్డు పక్కన ఉన్న భారీ తాటి చెట్లను తొలగించకుండానే పనులు కానిచ్చేస్తున్నారు. దీనివల్ల ప్రస్తుతం వాహనాలు నడిపే వారికి, పాదచారులకు ఈ చెట్లు పెను అడ్డంకిగా మారాయి. రోడ్డుపై వేగంగా వచ్చే వాహనదారులు అకస్మాత్తుగా ఎదురవుతున్న ఈ చెట్లను చూసి బెంబేలెత్తుతున్నారు. కొద్దిపాటి అజాగ్రత్త వహించినా నేరుగా చెట్లను ఢీకొనే ప్రమాదం పొంచి ఉంది.

**రాత్రి వేళల్లో 'చీకటి' ప్రమాదాలు**

ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో వెలుతురు సరిగ్గా లేకపోవడంతో పరిస్థితి మరింత భయానకగా మారుతోంది. కొత్తగా ప్రయాణించే వారికి రోడ్డు మధ్యలో చెట్లు ఉన్నాయనే విషయం తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. "అభివృద్ధి పనులు చేస్తున్నప్పుడు అడ్డంకులను తొలగించాలన్న కనీస స్పృహ కాంట్రాక్టర్ కు, పర్యవేక్షించే అధికారులకు లేదా?" అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందిస్తారా? అని ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మరియు కాంట్రాక్టర్ వెంటనే స్పందించి, ప్రయాణికుల భద్రత దృష్ట్యా రహదారికి అడ్డంగా ఉన్న తాటి చెట్లను తక్షణమే తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## అమరవీరులకు ఘన నివాళి

**– కొవ్వొత్తుల ప్రదర్శన..యువతకు విప్లవ స్ఫూర్తి అవసరం అని పిలుపు**

**వేద న్యూస్,కారేపల్లి:**




భారత స్వాతంత్ర్య సంగ్రామ విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతిని పురస్కరించుకుని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాసంఘాలు, పి.వై.ఎల్ ఆధ్వర్యంలో సింగరేణి మండలం మాదారం గ్రామంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి. రాకేష్, ఏఐయూకేఎస్ డివిజన్ కార్యదర్శి గుగులోతు తేజ నాయక్, అరుణోదయ జిల్లా నాయకుడు వేములపల్లి వీరన్న మాట్లాడుతూ దేశ విముక్తి కోసం అతి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు.సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వారు సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, నేటి యువత వారి ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం పోరాడటమే అమరవీరులకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ నాయకులు కోయిల ఉమామహేష్, కుమ్మరికుంట్ల నరేష్, కల్తి లక్ష్మీనారాయణ, తాటి కృష్ణ, వేములపల్లి రమేష్, తిరుమలగిరి ప్రసాదు, పూనం శ్రీను, ఈసం రాంబాబు, కోయిల వెంకన్న, సేవగాని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వరి,మొక్కజొన్న రైతులకు తక్షణ ఉపశమనం కావాలి

**వేద న్యూస్ ,కారేపల్లి:**



రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు సరైన ధర దక్కేలా మండల వ్యాప్తంగా తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సింగరేణి మండల తహసిల్దార్‌కు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కే. నరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ పత్తి, మిర్చి పంటలు నష్టపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా వరి, మొక్కజొన్న పంటలను విస్తృతంగా సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయంలో దళారీల దోపిడీకి గురి కాకుండా ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వరి పంటకు మాత్రమే కాకుండా మొక్కజొన్నకు కూడా బోనస్ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని విమర్శించారు. పంటలు కోత దశలో ఉన్న ఈ కీలక సమయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే రైతులను సమీకరించి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, తలారి దేవప్రకాశ్, పాసిని నాగేశ్వరరావు, ఈసం వెంకటేశ్వర్లు, అరేం రవి, భూక్య మల్సూర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం చేయలేని పనిని కాంగ్రెస్ చేసి చూపించింది

**– రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

గత ప్రభుత్వం చేయలేని పనిని కాంగ్రెస్ చేసి చూపించిందని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం కొరట్లగూడెం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేలకొండపల్లి వాసి..రామదాసు భద్రాచలం లో ఎన్నో కష్టాలు పడి రామాలయంను నిర్మిస్తే గత ప్రభుత్వం భద్రాచలం ఆలయాన్ని పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జిల్లా మంత్రులు,ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడతల వారీగా రూ. 560 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నరన్నారు. కేటీఆర్, కవిత లాంటి వాళ్లు ఖమ్మం వచ్చి అవాకులు చెవాకులు పేలుతున్నరని ఆయన మండిపడ్డారు.గత పది సంవత్సరాల్లో అధికారంలో ఉండి వారు చేయని పనులు ముగ్గురు మంత్రులు చేసి చూపిస్తున్నరన్నారు.జాతీయ రహదారులు,సాగు నీటి ప్రాజెక్టులు,విద్యారంగంలో, వైద్య రంగం లో ఖమ్మం జిల్లాను ముందుకు తీసుకుపోతున్నరని ఆయన చెప్పారు.పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క రెషన్ కార్డు ఇవ్వలేదని, ఇందిరమ్మ ప్రభుత్వం లో పేదలకు రేషన్ కార్డులు ఇచ్చి సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు.రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు. సర్పంచ్,మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వైపే ఉంటారని ఆయన స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్,మాజీ మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు,కాంగ్రెస్ జిల్లా నాయకులు కొడాలి గోవిందరావు,నెల్లూరి భద్రయ్య,రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజని,నేలకొండపల్లి యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, రాయగూడెం ,రామచంద్రాపురం సర్పంచ్లు బోయిన వేణు,దుద్దేల పవన్,కాంగ్రెస్ నాయకులు నంబూరి రామారావు, కొత్తపల్లి సుబ్బయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయండి

## – గద్దల సుకుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు

**వేద న్యూస్, హన్మకొండ :**



ఏప్రిల్ 7న ముంబైలో జరుగు ఎంఆర్పిఎస్ జాతీయ కార్యవర్గ సమావేశానికి హనుమకొండ జిల్లా లో ని ప్రతి ఎంఆర్పిఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. గురు వారం నయీమ్ నగర్ లో ఎమ్మార్పీఎస్ హనుమకొండ మండల అధ్యక్షులు బొక్క రాజేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశానుసారం ఏప్రిల్ 7న ముంబైలో జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఆ జాతీయ కమిటీ సమావేశంలో ఎమ్మార్పీఎస్ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఇంకా వర్గీకరణ అమలు కానీ రాష్ట్రాలలో వర్గీకరణ అమలుకై ఎమ్మార్పీఎస్ పోరాటాన్ని ఉధృతం చేయడం కోసం మరియు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దేశంలో దళితులపై జరుగుతున్న దాడుల విషయం మరియు ప్రజా సమస్యల పైన మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దేశంలో మిగిలి ఉన్న ప్రజా సమస్యల పైన చర్చించడం జరిగి భవిష్యత్ కార్యాచరణ మందకృష్ణ మాదిగ గారు జాతీయ కమిటీ సమావేశంలో ప్రకటిస్తారని తెలియజేశారు. ఈ యొక్క జాతీయ కమిటీ సమావేశానికి హనుమకొండ జిల్లాలో ఉన్న అన్ని మండలాల నుండి ఎంఆర్పిఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు ఏప్రిల్ 7న జరుగు జాతీయ కమిటీ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుంచు రజిని కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యదర్శి రేణుకుంట్ల, రాజేందర్ మాదిగ,

**ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు**

ఎర్ర రాము మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఎర్ర వరద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ డివిజన్ గౌరవ అధ్యక్షులు ఇమ్మడి రాజీవ్ మాదిగ,

**ఎమ్మార్పీఎస్ 56 డివిజన్ అధ్యక్షులు**

సుంచు కార్తీక్ మాదిగ,ఎమ్ ఎస్ ఎఫ్ మండల అధ్యక్షులు, సిలువేరు కిరణ్ మాదిగ, దామెర అరుణ్ మాదిగ,ల్యాదేళ్ళ పవన్ మాదిగ,కిన్నెర రాజేష్ మాదిగ, ఎర్ర కాలి మాదిగ,ఎర్ర రాజు మాదిగ,మునిగాల గోపాల్ మాదిగ, హనుమకొండ విక్రమ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధిని అరికట్టాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ నగరంలోని ఎస్ఆర్ఆర్ తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉర్సు దర్గా ప్రాంతంలో నమోదైన డెంగ్యూ పాజిటివ్ కేసును డిస్టిక్ మలేరియా ఆఫీసర్ కె. రజిని స్థానిక వైద్యాధికారి డాక్టర్.అనితతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి డెంగ్యూ వ్యాధి నివారణ చర్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిస్టిక్ మలేరియా ఆఫీసర్ కె.రజిని మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి చుట్టూ మరియు ఇంటి లోపల నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని తద్వారా డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా ఉండాలని కోరారు. అదేవిధంగా వైద్య సిబ్బంది ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని మరియు కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యాధి ప్రభావిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. వైద్య సిబ్బం ది మున్సిపల్ సిబ్బంది తో కలిసి యాంటిలర్వల్ ఆపరేషన్ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి, హెచ్.ఈ.ఓ. సదానందం, విజయేందర్, మునిసిపల్ సూపర్వైజర్ మధుకర్, కుమార స్వామి, రామ రాజేష్ ఖన్నా, ఏ.ఎన్.ఎం అనిత, మున్సిపల్ వర్కర్స్, శివ, ఆశా కార్యకర్తలు సుధా, అనిత మరియు తదితరులు పాల్గొన్నారు.

# రామరసానికి ముడి సరుకులు అందించిన వాసవి క్లబ్

## – శ్రీరామనవమి సందర్భంగా సేవా కార్యక్రమం

**వేద న్యూస్, కరీంనగర్:**



శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవంలో భక్తులకు పంపిణీ చేసే రామరసానికి అవసరమైన ముడి సరుకులను వాసవి క్లబ్ సభ్యులు అందించారు. నగరంలోని రాంనగర్, హరినగర్ వీరాంజనేయ స్వామి దేవాలయాలు, భగత్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయాలలో జరిగే కార్యక్రమాల కోసం ఈ సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, స్వామివారి సేవలో భాగంగా ప్రసాదానికి ముడి సరుకులు అందించే అవకాశం రావడం ఆనందంగా ఉందని తెలిపారు. భక్తులందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతూ, స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాటక కళాకారుల కృషికి సముచిత గుర్తింపు

- సమాజ చైతన్యంలో రంగస్థలం కీలక పాత్ర
- మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పోకడలు
- ప్రపంచవ్యాప్తంగా ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్ డెస్క్:**

ప్రతి ఏటా మార్చి 27వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రంగస్థల దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. నాటక కళ యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పడంతో పాటు, ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కళాకారుల శ్రమను గుర్తించడం ఈ రోజు ప్రధాన ఉద్దేశ్యం. 1961లో ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ప్రారంభమైన ఈ వేడుకలు, నేటికీ కళాకారులకు ఒక గొప్ప వేదికగా నిలుస్తున్నాయి. సమాజంలోని రుగ్మతలను ఎండగట్టడంలోనూ, ప్రజలను చైతన్యపరచడంలోనూ నాటక రంగం పోషిస్తున్న పాత్ర వెలకట్టలేనిదని ప్రముఖులు కొనియాడుతున్నారు. మానవ నాగరికత పరిణామ క్రమంలో నాటకం అనేది కేవలం వినోద సాధనంగానే కాకుండా, సామాజిక మార్పుకు ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తూ వస్తోంది. రంగస్థలం అనేది ఒక సజీవ కళారూపం, ఇక్కడ నటుడు మరియు ప్రేక్షకుడు ఒకే సమయంలో ఒకే భావోద్వేగాన్ని పంచుకుంటారు. ప్రత్యక్షంగా ప్రేక్షకుల ముందు ప్రదర్శించే నాటకం ఇచ్చే అనుభూతిని మరే ఇతర వినోద సాధనం ఇవ్వలేదు. డిజిటల్ యుగంలో వినోద సాధనాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా, నాటకానికి ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. పాత కాలపు జానపద కళారూపాలను కాపాడుకుంటూనే, నేటి తరాన్ని ఆకట్టుకునేలా ఆధునిక సాంకేతికతను జోడించి కొత్త ప్రయోగాలు చేయడం ఇప్పుడు అవసరంగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని పరిషత్తు నాటకాలు మరియు పద్య నాటకాలకు ఉన్న ప్రాధాన్యతను పునరుద్ధరించడం ద్వారా మన సంస్కృతిని కాపాడుకోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా మరియు ఓటిటి ప్లాట్‌ఫారమ్‌ల ప్రభావం పెరగడంతో కళల పట్ల యువతకు ఆసక్తి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. ఇటువంటి తరుణంలో యువతను రంగస్థలం వైపు ప్రోత్సహించడం అత్యంత ఆవశ్యకం. పాఠశాలలు మరియు కళాశాలల స్థాయిలో నాటక పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చు. నాటక రంగం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఉచ్చారణ సామర్థ్యం మరియు ఆత్మవిశ్వాసం మెరుగుపడతాయని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా నాటక కళాకారులకు ప్రత్యేక పెన్షన్లు, హెల్త్ కార్డ్స్ మరియు ప్రదర్శనలకు కావాల్సిన ఆడిటోరియం సదుపాయాలను ఉచితంగా కల్పించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళాకారుల సంఘాలు కోరుతున్నాయి. సాంకేతిక విప్లవం కారణంగా నాటక ప్రదర్శనల్లో లైటింగ్, సౌండ్ సిస్టమ్ మరియు స్టేజ్ సెట్టింగ్స్‌లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రేక్షకులకు ఒక సరికొత్త దృశ్యకావ్యాన్ని ఆవిష్కరిస్తోంది.ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా మరియు ఓటిటి ప్లాట్‌ఫారమ్‌ల ప్రభావం పెరగడంతో కళల పట్ల యువతకు ఆసక్తి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. ఇటువంటి త అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే నాటక ఉత్సవాల్లో భారతీయ కళాకారులు తమ ప్రతిభను చాటుకుంటూ దేశ ప్రతిష్టను పెంచుతున్నారు. మన దేశంలో ఉన్న వైవిధ్యభరితమైన సంస్కృతులను, సంప్రదాయాలను నాటకాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం నేడు సులభతరమైంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న వీధి నాటకాలు, బుర్రకథలు వంటి కళారూపాలను రంగస్థలంతో ముడిపెట్టి ప్రదర్శించడం వల్ల వాటికి నూతన జీవం లభిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు.

# వనపర్తిలో బాలికపై దారుణం రాజకీయంగా ఉద్రిక్తత

- ప్రైవేట్ పాఠశాలలో బాలికపై ఉపాధ్యాయుడి అత్యాచారం ఆరోపణ
- నిరసనకు వెళ్లిన బీఆర్ఎస్ నేతల అరెస్టు
- బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్

**వేద న్యూస్ వనపర్తి :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బాలికపై ఉపాధ్యాయుడు అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. అక్షర స్కూల్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. మైనారిటీకి చెందిన బాలికపై ఈ దారుణం జరిగిందని సమాచారం. ఈ ఘటనపై స్పందించిన బీఆర్ఎస్ నాయకులు పాఠశాలకు వెళ్లి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అయితే, అక్కడికి చేరుకున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రాజకీయంగా పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అరెస్టు చేసిన నాయకులను పరామర్శించారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాల్సిన సమయంలో నిరసన తెలిపిన వారిని అరెస్టు చేయడం అన్యాయమని మండిపడ్డారు. అఘాయిత్యానికి పాల్పడిన ఉపాధ్యాయుడు, పాఠశాల యాజమాన్యాన్ని కాపాడేందుకు రాజకీయ కుట్ర జరుగుతోందని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి అరెస్టు చేశారని విమర్శించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీజేపీ, సీపీఎం, సీపీఐ నేతలు కూడా స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయకూడదని నాయకులు అన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఘటనపై అధికారులు ఎలా స్పందిస్తారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# వర్షాధార ప్రాంతాల అభివృద్ధికి శిక్షణ, ఆస్తుల పంపిణీ

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యక్రమం
- రైతు వేదికలో అవగాహన, పరికరాల అందజేత
- ఉద్యాన, పట్టు పరిశ్రమలపై దృష్టి



**వేద న్యూస్ అదిలాబాద్ :**

"ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా అదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకంపై శిక్షణ, ఆస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరై రైతులకు పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు వర్షాధార ప్రాంతాల్లో పంటల ఉత్పత్తి పెంపు, నీటి వినియోగం, పంటల విభిన్నీకరణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యాన, పట్టు పరిశ్రమల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను వివరించారు. ఆధునిక సాంకేతికతలను వినియోగించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని నిపుణులు సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వర్షాధార ప్రాంతాల్లో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. రైతులు అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు శిక్షణ ఇచ్చారు. పట్టు పరిశ్రమ అభివృద్ధి, కొత్త పంటల సాగు, మార్కెటింగ్ అవకాశాలపై వివరించారు. రైతులు నూతన పద్ధతులను స్వీకరించి ఆదాయం పెంచుకోవాలని ప్రోత్సహించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, శాస్త్రవేత్త మల్లేష్, ఉద్యానవన అధికారులు, ఇతర శాఖల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు సంఘం నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మొత్తంగా ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అవసరమైన అవగాహన, పరికరాలు అందించబడినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పథకాలు రైతుల అభివృద్ధికి దోహదపడతాయని, వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073